క్లుప్తంగా

కాకాణి పరామర్శ



నివాళులర్పిస్తున్న కాకాణి

మనుబోలు: మండల కేంద్రమైన మనుబోలుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు దయాకర్‌ను మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. దయాకర్ తండ్రి భాస్కర్ సోమవారం అనారోగ్యంతో మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న కాకాణి మనుబోలు బీసీ కాలనీలోని వారి ఇంటికి వెళ్లి భాస్కర్ మృతదేహానికి నివాళులర్పించారు. దయాకర్‌ను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట నాయకులు బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, కసిరెడ్డి ధనంజయరెడ్డి, మన్నెమాల సుధీర్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, మహేంద్రవర్మ, భాస్కర్‌రెడ్డి, పెంచలయ్య, పార్థు తదితరులున్నారు.

పొదలకూరులో ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పొదలకూరు: డీఆర్‌డీఏ వెలుగు ఆధ్వర్యంలో సోమవారం లింగ వివక్షపై పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. వీఓఏలు, మహిళా సంఘాలు, సీసీలు పాల్గొని తల్లిదండ్రులు కొడుకు, కూతురు అనే తేడా చూపకూడదని నినాదాలు చేశారు. ముందుగా స్వయం సహాయ సంఘాల సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. ఈనెల 25 నుంచి డిసెంబర్ 23వ తేదీ వరకు గ్రామ సంఘం, స్వయం సహాయ సంఘాల సమావేశాల్లో తప్పనిసరిగా లింగ వివక్షపై చర్చించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ డీవీ నరసింహారావు, ఏసీ, ఏపీఎం చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

3న కార్యవర్గ ఎన్నిక



సమావేశానికి హాజరైన నాయీ బ్రాహ్మణ సంఘ సభ్యులు

కొడవలూరు: వచ్చే నెల 3న నాయీ బ్రాహ్మణ, త్యాగరాజస్వామి సంగీత కళాక్షేత్రం నూతన కార్యవర్గ ఎన్నిక జరుగుతుందని యోగా గురువు డాక్టర్ బాల సుబ్రహ్మణ్యం తెలిపారు. మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న త్యాగరాజస్వామి సంగీత కళాక్షేత్రంలో నాయీ బ్రాహ్మణ సంఘ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యవర్గ కాల పరిమితి ముగిసినందున వచ్చే నెల 3న జరిగే ఎన్నికకు సంఘ సభ్యులంతా హాజరు కావాలని కోరారు. సమావేశంలో సంఘ సభ్యులు ఆలూరు సుధాకరయ్య, పొన్నూరు చంద్ర, జువ్వలదిన్నె వెంకట సురేష్, పెంద్యాల మాధవ, కాకి వెంకట రమణయ్య, అరవపాటి వేణు, రమణయ్య, సురేష్, శ్రీనివాసులు, సతీ ష్, జనార్దన్ పాల్గొన్నారు.

అలా వదిలేశారు!



తోటపల్లిగూడూరు పోలీస్‌స్టేషన్‌లో వాహనాలు

తోటపల్లిగూడూరు: నిబంధనలకు విరుద్ధంగా తిరిగే వాహనాలను పోలీసులు తనిఖీల్లో భాగంగా పట్టుకుని జరిమానా విధించి స్టేషన్‌కు తరలిస్తుంటారు. వాహన యజమాని సంబంధిత ధ్రువీకరణ పత్రాలు సమర్పించి, జరిమానా చెల్లిస్తే వాటిని ఇచ్చేస్తారు. కట్టకపోతే వాహనాలను అప్పగించరు. అవి స్టేషన్ వద్దే ఉండిపోతాయి. కాగా వాటిని ఏడాదికో, రెండేళ్లకో వేలం పాటల ద్వారా విక్రయించి వచ్చిన సొమ్మును ప్రభుత్వ ఖజానాకు తరలించాలి. అయితే పోలీస్ శాఖ కొంతకాలంగా ఇలాంటి పని చేయడం లేదు. దీంతో వాహనాలు సంవత్సరాల తరబడి ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ తుప్పుపడుతున్నాయి. తోటపల్లిగూడూరు పోలీస్‌స్టేషన్‌లో పదుల సంఖ్యలో కార్లు, ఆటోలు, బైక్‌లున్నాయి.

చికెన్ వ్యర్థాలను తరలిస్తే చర్యలు

- ఎస్సై కోటిరెడ్డి



కొడవలూరు: వచ్చే నెల 1వ తేదీ నుంచి చేపల గుంతలకు చికెన్ వ్యర్థాలు తరలించడం నిషేధించినట్లు కొడవలూరు ఎస్సై సీహెచ్.కోటిరెడ్డి సోమవారం తెలిపారు. ఎవరైనా చికెన్ వ్యర్థాలను తరలిస్తే కేసులు నమోదు చేసి కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఎక్కడైనా చికెన్ వ్యర్థాలను తరలిస్తుంటే 94407 96328 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

జీవాలు జాగ్రత్త

- పాడి పశువులకు దోమకాటు
- పాల దిగుబడిపై ప్రభావం
- దోమతెరలు ఏర్పాటు చేస్తున్న వైనం

ముత్తుకూరు: దోమల వల్ల మనుషులే కాదు.. పశువులకు కూడా ఎన్నో కష్టాలు ఎదురవుతున్నాయి. వేసవిలో వచ్చే సమస్యలు అటుంచితే.. చలి కాలం , మంచు కురిసే కాలంలో వాటి వెతలు అధికంగా ఉన్నాయి. పాలు ఇచ్చే గేదెలకు, ఆవులకు ఈ బాధలు తప్పవని రైతులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా నల్ల పశువులు 6,27,930, తెల్ల పశువులు 57,343 ఉన్నట్లు అంచనా.

ఆ సమయంలో..

దోమలు రాత్రి వేళ మాత్రమే బాధిస్తాయి. అయితే ఈ సీజన్‌లో పుట్టుకొచ్చే ఈగలు పట్టపగలే రక్తాన్ని పీల్చేస్తున్నాయి. పాల దిగుబడిపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. సాయంకాలం 4 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు ఈ దోమలు విపరీతంగా దాడి చేస్తున్నాయి. రూ.లక్షలు విలువైన పాడి పశువులు వీటి వల్ల కష్టాలు పడకూడదని ఖర్చు చేసి దోమతెరలు ఏర్పాటు చేస్తున్నారు. లేకుంటే పశువులు దోమకాటుకు గురై, సక్రమంగా పాలు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో పాడి రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదముంది. ఇందు కోసం రైతులు రూ.5 వేల నుంచి రూ.8 వేల వరకు ఖర్చు చేసి పశువుల పాకల చుట్టూ దోమతెరలు అమర్చుతున్నారు. లేగదూడల సంరక్షణ కోసం రైతులు కొందరు ఫ్యాన్లు కూడా పెడుతున్నారు. ముత్తుకూరు, నేలటూరు, కృష్ణపట్నం, పంటపాళెం, వెంకన్నపాళెం, బ్రహ్మదేవి తదితర పంచాయతీల్లో పాడి పశువులు అధికంగా ఉండడంతో రైతులు వాటి కోసం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు.



కోళ్లమిట్టలో పశువులకు ఏర్పాటు చేసిన దోమతెర

దోమతెరలు తప్పనిసరి



చలి కాలంలో దోమల బెడద అధికంగా ఉంటుంది. పశువుల రక్తం పీల్చి బలహీన పరుస్తాయి. వీటి నివారణకు తప్పనిసరిగా దోమతెరలు వినియోగించాలి. లేని పరిస్థితిలో వేప నూనె పశువులకు పూయాలి. ముఖ్యంగా పొదుగు వద్ద పూయాలి. పశువుల పాకలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. దోమలు అధికంగా ఉన్న సమయంలో తడిపిన ఎండు గడ్డి, వేప ఆకు మండించి పాకల్లో పొగ పెట్టాలి.

– డాక్టర్ పి.నిర్మల, ఏడీ, వెటర్నరీ, ముత్తుకూరు



బ్రహ్మదేవిలో..



ముత్తుకూరులో..

దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాసులు

బుచ్చిరెడ్డిపాళెం : దివ్యాంగులకు ప్రభుత్వం అందించే ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మన్నేపల్లి శ్రీనివాసులు కోరారు. బుచ్చిరెడ్డిపాళెం మండల పరిషత్ కార్యాలయంలో దివ్యాంగులకు ఉపకరణాలు అందించే క్యాంపు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపకరణాల పంపిణీకి అర్హులను ఎంపిక చేసేందుకు ఈ క్యాంప్ నిర్వహించినట్లు తెలిపారు. సీఆర్సీ అధికారులు రాకేష్, రఘు మాట్లాడుతూ ఈ క్యాంపులో 80 మంది పాల్గొనగా, 18 మందికి వీల్ చైర్స్, 20 మందికి మూడు చక్రాల బ్యాటరీ బండ్లు, 30 మందికి వినికిడి యంత్రాలు, నలుగురికి టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్, పది మందికి మూడు చక్రాల బండ్లు మంజూరు చేసినట్లు తెలిపారు.

మంచుతెర చాటున.. భానుడి పలకరింపు

మంచుతెరలను చీల్చుకుంటూ ప్రభాతవేళ భానుడి పలకరింపు ఆహ్లాదకరంగా ఉంటుంది. ఉదయం సమయంలో పనికి వెళ్లేవారు, వాకర్స్ రవి కిరణాలను ఆస్వాదిస్తున్నారు. తెల్లవారుజామున హిమ శోయగాలు నయనానందకరంగా ఉంటున్నాయి. – పొదలకూరు



పొగమంచు మాటున



మంచుతెరల్లో భానుడు

భూ సమస్యలపై వినతులు

పొదలకూరు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం జరిగింది. తహసీల్దార్ శివకృష్ణకు భూ సమస్యలపై వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాసుపుస్తకాలు, భూముల కొలతలు తదితర సమస్యలపై వినతిపత్రాలను అందజేశారు. వాటిని పరిశీలించిన ఆయన సంబంధిత వీఆర్వోలకు అందజేసి వెంటనే పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గొలగమూడి విద్యార్థినులు



హారిక



విఖిత



నాగలక్ష్మి వరప్రసన్న



ఇలాక్షి

వెంకటాచలం: కాకినాడలో ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్ – 17 సాఫ్ట్‌బాల్ పోటీలకు మండలంలోని గొలగమూడి వద్దనున్న ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. పదో తరగతి చదువుతున్న జి.హారిక, బి.విఖిత, టి.నాగలక్ష్మి వరప్రసన్న, జి.ఇలాక్షి ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.లక్ష్మీకామేశ్వరి, పీడీ షేక్ షబిక సోమవారం తెలిపారు.

ప్రిన్సిపల్ వినూత్న ఆలోచన



ప్రింటర్‌ను ప్రారంభిస్తున్న విద్యార్థిని

కోవూరు : స్థానిక జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ సికిందర్ వినూత్న కార్యక్రమం చేపట్టారు. కళాశాలలో అధిక ఉత్తీర్ణత సాధించిన జూనియర్ ఎంపీసీ విద్యార్థిని వెంకటరమణమ్మ చేతుల మీదుగా కంప్యూటర్, ప్రింటర్ కమ్ స్కానర్‌కు సోమవారం ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఇలాంటి గౌరవం ఇస్తున్నట్లు తెలిపారు. దీనిని స్ఫూర్తిగా తీసుకుని కళాశాలలోని ఇతర విద్యార్థులు కూడా కష్టపడి చదివేలా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు.

బిజినెస్ ప్రోగ్రామ్‌పై శిక్షణ



మాట్లాడుతున్న ప్రోగ్రామ్ ఆఫీసర్

కోవూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో జనరేట్ యువర్ బిజినెస్ ప్రోగ్రామ్ కింద ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు మూడు రోజుల శిక్షణా తరగతులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రోగ్రామ్ ఆఫీసర్ అబ్దుల్ ఖయూమ్, ప్రిన్సిపల్ లక్ష్మీప్రసూన మాట్లాడారు. వ్యాపారంలో పాటించాల్సిన నిబంధనలను వివరించారు.

శ్మశాన స్థలంలో నీళ్ల ట్యాంక్ నిర్మాణం



శ్మశానానికి ఇచ్చిన స్థలంలో పనులు



మంచినీటి పథకం నిర్మాణానికి చేస్తున్న పనులు

- స్థల దాత ఆందోళన

ముత్తుకూరు: రెండు గ్రామాల శ్మశానం కోసం గత ప్రభుత్వంలో ఓ నాయకుడు ఇచ్చిన స్థలంలో రక్షిత మంచినీటి పథకం నిర్మాణం చేపట్టడం వివాదంగా మారింది. వివరాలిలా ఉన్నాయి. వల్లూరు పంచాయతీలోని పచ్చికాయలమిట్ట, చుట్టుగుంట గ్రామాల శ్మశానం కోసం అప్పటి రాష్ట్ర హార్టికల్చర్ బోర్డు సభ్యుడు దువ్వూరు చంద్రశేఖరరెడ్డి కొంత స్థలాన్ని ఇచ్చారు. ఈ శ్మశాన అభివృద్ధి కార్యక్రమాన్ని గతేడాది మార్చి 27వ తేదీన నాటి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థలాన్ని ఇచ్చిన చంద్రశేఖరరెడ్డిని అభినందించారు. అయితే ఈ భూమిలో ప్రస్తుతం స్థానిక నాయకులు రక్షిత మంచినీటి పథకం నిర్మాణం చేపట్టారు. దీనిపై దాత తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ అంశంపై సర్పంచ్ పెంచల ప్రతాప్ మాట్లాడుతూ స్థానికుల కోరిక ప్రకారం రక్షిత మంచినీటి పథకం నిర్మాణం చేపట్టామని, అలాగే చంద్రశేఖరరెడ్డి అభ్యంతరం చెబుతున్నారని వెల్లడించారు.

పరిమితి మేరకే పొగాకు పండించాలి

మర్రిపాడు: పొగాకు బోర్డు అనుమతించిన మేరకు మాత్రమే రైతులు పొగాకును పండించాలని డీసీపల్లి పొగాకు వేలం కేంద్రం నిర్వహణాధికారి జి.రాజశేఖర్ సూచించారు. డీసీపల్లి పొగాకు బోర్డు పరిధిలోని గండ్లవీడులోని పొగాకు రైతులకు సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మూడేళ్లుగా అంతర్జాతీయంగా పొగాకు సాగు తగ్గి ధరలు ఆశాజనకంగా ఉన్నాయన్నారు. ఈ ఏడాది ప్రపంచ దేశాల్లో పొగాకు ఎక్కువ సాగుచేసే అవకాశం ఉందన్నారు. గతేడాది మాదిరిగా ధరలు ఉంటాయని రైతులు ఎక్కువ సాగుచేస్తే నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల బోర్డు అనుమతించిన మేరకే నాణ్యమైన పొగాకును పండించాలని సూచించారు. అనంతరం ఎరువులు, పురుగు మందులు, సాగునీరు, పొగాకు క్యూరింగ్‌పై అవగాహన కల్పించారు. ఐటీసీ మేనేజర్ వెంకటేష్, ఫీల్డ్ ఆఫీసర్ ఆదర్శ్ జగన్నాథ్, బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

కార్తీకం.. దివ్య శోభితం



పొదలకూరు: దేవస్థానం ప్రాంగణంలో..



మనుబోలు: ప్రత్యేకాలంకరణలో విశ్వనాథస్వామి

పొదలకూరు: పట్టణంలోని కామాక్షి సమేత రామలింగేశ్వరాస్వామి (శివాలయం) దేవస్థానంలో కార్తీక మాసం నాలుగో సోమవారం సందర్భంగా మహిళలు దీపాలు వెలిగించారు. ప్రధానార్చకుడు ప్రసాద్‌స్వామి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండలంలోని మరుపూరు కామాక్షితాయీ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానం, చెన్నారెడ్డిపల్లి పంచలింగేశ్వరాలయంలో కార్తీక దీపాలను వెలిగించేందుకు మహిళా భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

- **మనుబోలు:** మండలంలోని సంగమేశ్వరాలయంతోపాటు పిడూరు, పిడూరుపాళెం, బద్దెవోలు, కొలనకుదురు, మడమనూరు, కుడితిపల్లి తదితర గ్రామాల్లోని శివాలయాలకు సోమవారం భక్తులు పోటెత్తారు. మనుబోలులో ధ్వజస్తంభం వద్ద కార్తీక దీపాలు వెలిగించారు. అర్చకులు శ్రీనివాసులు, ఫణీంద్ర శర్మ, సాయికుమార్‌శర్మ పూజలు నిర్వహించారు. విశ్వనాథస్వామి ఆలయం వద్ద జరిగిన కార్యక్రమాలకు మనుబోలు గ్రామానికి చెందిన బొమ్మిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, జానకి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.
- **తోటపల్లిగూడూరు:** మండలంలోని ఇస్కపాళెంలో ఉన్న ఖరేశ్వరస్వామి ఆలయంలో సోమవారం మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు.

జొన్నవాడలో..

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయంలో సోమవారం అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయ పండితులు భక్తులకు కార్తీకమాస విశిష్టతను వివరించారు. ఆలయ ఈఓ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సాయి మందిరంలో..

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెంలోని శిరిడీ సాయి మందిరంలో కార్తీక మాసం నాలుగో సోమవారం సందర్భంగా భక్తులు పోటెత్తారు. పాతూరులోని కాశీ విశ్వనాథస్వామి దేవస్థానంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. కాశీ అన్నపూర్ణేశ్వరి, కాశీనాథులకు అభిషేకాలు జరిగాయి. కలిగిరి రిజర్వాయర్ వద్ద ఉన్న శివలింగానికి ప్రత్యేక జలాభిషేకాలు నిర్వహించారు.



మనుబోలు: ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడలో..



బుచ్చిరెడ్డిపాళెం : సాయిబాబా మందిరంలో..

అవకతవకలపై కలెక్టరేట్‌లో ఫిర్యాదు

విడవలూరు: మండలంలోని సాగునీటి సంఘాల ఓటరు లిస్టుకు సంబంధించి అవకతవకలు జరిగాయని, దీనిపై తహసీల్దార్ చంద్రశేఖర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానిక రైతు పొన్నలూరు పురంధర్‌రెడ్డి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగునీటి సంఘాలకు సంబంధించి విడుదల చేసిన ఓటరు లిస్టు సక్రమంగా లేదని, మరోసారి సర్వే జరిపించి నిజమైన రైతులను గుర్తించాలని స్థానిక తహసీల్దార్‌కు అర్జీ ఇచ్చినా, సరైన చర్యలు లేవని వాపోయారు. ముదివర్తి, వావిళ్ల చెరువు కింద రైతులను విడవలూరు చెరువు కింద కలిపి వారికి ఓటు హక్కు కల్పించారని తెలియజేశారు. అదేవిధంగా ఒక కాలువ కింద ఉన్న రైతుకు మూడు కాలువల కింద ఓటు హక్కును కల్పించారని, వీటిపై విచారణ జరిపి మరలా సర్వే చేయించి కొత్త ఓటరు లిస్టును తయారు చేయాలని, ఈ తప్పులకు పాల్పడిన తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించాలి



యల్లాయపాళెం హైస్కూల్లో క్విజ్ పోటీలను పరిశీలిస్తున్న అధికారులు

కొడవలూరు: ప్రతి పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని విధిగా నిర్వహించాలని ఎంఈఓ జి.వసంతకుమారి సూచించారు. మండలంలోని యల్లాయపాళెం జెడ్పీ హైస్కూల్‌లో రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీలను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో విద్యార్థులకు రాజ్యాంగ ప్రాముఖ్యతను వివరించాలన్నారు. విద్యార్థులతో రాజ్యాంగ సంబంధిత క్విజ్‌లు, సెమినార్‌లు, గ్రూప్ డిస్కషన్‌లు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎ.మోహనరామలింగయ్య, ఉపాధ్యాయులు ఎం.పుష్పకళ, ఎ.పుట్లయ్య, గాయత్రి, కృష్ణసుధా, సునీల్, సీఆర్‌ఎంటీ ఎం.దయాకర్ ఉన్నారు.

చెన్నారెడ్డిపల్లిలో కోతుల బెడద

పొదలకూరు: మండలంలోని చెన్నారెడ్డిపల్లిలో కోతుల బెడదకు గ్రామస్తులు హడలెత్తిపోతున్నారు. ఇళ్లు, దుకాణాల్లోకి చొరబడి చేతికందిన సామగ్రిని పట్టుకుపోతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించాల్సిన పంచాయతీ నిర్వాహకులు మీనమేషాలు లెక్కిస్తుండడంతో కోతుల ఆగడాలకు తట్టుకోలేక పోతున్నారు. గ్రామంలో చాలామంది ఇళ్లలో పచ్చటి చెట్లను కూడా తొలగిస్తున్నారు. చెట్లు ఉంటే కోతులు చేరి ఇంటిని ధ్వంసం చేస్తున్నాయని వాటిని నిలువునా నరికివేయిస్తున్నారు. వెంటనే పంచాయతీ అధికారులు స్పందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.